క్లుప్తంగా

ముందస్తు అరెస్టు

శాయంపేట : బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తలపెట్టిన అసెంబ్లీ ముట్టడికి బీఆర్ఎస్వీ నాయకులు వెళ్లకుండా పోలీస్‌లు చర్యలు చేపట్టారు. మంగళవారం బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకుడు కొమ్ముల శివను అదుపులోకి తీసుకున్నారు. శివ మాట్లాడుతూ.. సామాజిక ప్రజా ఉద్యమాలకు వేదికైన ఓయూలో విద్యార్థుల నిరసన కార్యక్రమాన్ని రద్దు చేయడం అన్యాయమని మండిపడ్డారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని నియమించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తుందని విమర్శించారు. అక్రమ అరెస్టులకు భయపడేదిలేదన్నారు.

పోగొట్టుకున్న పర్సు అప్పగింత

ఎంజీఎం : ఎంజీఎం ఆస్పత్రిలో మంగళవారం వైద్యసేవల కోసం వచ్చిన ఓ వృద్ధురాలు తన పర్సును పోగొట్టుకోగా నర్సింగ్ ఆఫీసర్ నర్సమ్మ సదరు వృద్ధురాలికి అప్పగించింది. ఆస్పత్రిలో ప్రత్యేక వృద్ధుల ఓపీ వద్దకు ఓపీ చిట్టి రాయించుకుని మందులు తీసుకునే క్రమంలో పర్సును పోగొట్టుకుంది. ఓపీలో విధులు నిర్వహిస్తున్న నర్సింగ్ ఆఫీసర్ నర్సమ్మ, సెక్యూరిటీ సిబ్బంది పర్సు పోగొట్టుకున్న విషయాన్ని గమనించి ఆ పర్సును వృద్ధురాలికి అప్పగించారు.

తేనెతో శ్వేతార్కుడికి ప్రత్యేక అభిషేకం

కాజీపేట : కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో మంగళవారం స్వామి వారికి తేనెతో అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు, పరిపాలన అధికారి అయినవోలు సాయికృష్ణశర్మ ఆధ్వర్యంలో అర్చకులు భక్తులు సమర్పించిన తేనెతో అభిషేకం జరిపించారు. ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ గణపతిని ఆరాధించడం వల్ల కలిగే ప్రయోజనాలపై ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. ఆలయ మేనేజర్ రవి, పీఆర్ఓ మణిదీప్, సుధీర్, అరుణ్‌కుమార్‌రెడ్డి, గంగుల రాజిరెడ్డి, దేవులపల్లి సదానందం తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ ఎదుగుదల ఓర్వలేకనే ఆరోపణలు

వరంగల్ : నగరంలోని 14వ డివిజన్ ఏనుమాముల ఎన్టీఆర్ నగర్‌లో సోషల్ మీడియా రాష్ట్ర మాజీ కోఆర్డినేటర్ అడుప మహేష్‌పై కొందరు మహిళలు దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటని సీనియర్ కాంగ్రెస్ నాయకులు సౌరం అభిలాష్ ఒక ప్రకటనలో తెలిపారు. నిజాయితీ గల కార్యకర్తగా మహేష్ రాజకీయ ఎదుగుదలను ఓర్వలేకనే అసత్య ఆరోపణలు చేయించడం సరికాదన్నారు.

మంద కృష్ణమాదిగను విమర్శిస్తే ఊరుకునేది లేదు

నయీంనగర్ : ఏబీసీడీ వర్గీకరణ కోసం 30 ఏళ్ల పాటు సుదీర్ఘంగా కృషి చేస్తున్న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను విమర్శిస్తే సహించేది లేదని టీఎంఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి మాదిగ హెచ్చరించారు. మంగళవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కొందరు వ్యక్తులు మంద కృష్ణ మాదిగను టార్గెట్ చేసి విమర్శిస్తున్నారని వారిని మాదిగ జాతి సహించదన్నారు. సమావేశంలో నాయకులు ఏ.ధర్మరాజు, రఘు, మూర్తి రాజు, ఏలియా, దామోదర్, రాజు, స్వామి, సందీప్, ప్రభాకర్, శాంతి తదితరులు పాల్గొన్నారు.

లాడ్జిలకు అనుమతి ఇవ్వొద్దు

ఖిలా వరంగల్: జనావాసాల మధ్య ఓయో లాడ్జిలకు అనుమతులు ఇవ్వొద్దంటూ స్థానిక ప్రజలు నగరపాలక సంస్థ అధికారులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం వరంగల్ గవిచర్ల క్రాస్‌రోడ్డులో ఏర్పాటు చేయబోతున్న ఓయో లాడ్జిని నగరపాలక సంస్థ అధికారులు పరిశీలించారు. భవనానికి కట్టిన ఫ్లెక్సీని అధికారులు తొలగించారు. లాడ్జీ ఏర్పాటుకు జనావాసాల మధ్య ఓయో రూంలకు అనుమతి ఇవ్వబోమని స్థానిక ప్రజలకు అధికారుల హామీ ఇచ్చారు. వారి వెంట గణేష్‌నగర్ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు గోవిందం దామోదర్, మడూరి సోమయ్య, విజయ్, శ్రీనివాస్ రావు, సదానందం, మదన్‌లాల్, యాకయ్య తదితరులు ఉన్నారు.

సఖి సేవలపై అవగాహన

ఖిలా వరంగల్ : వరంగల్ కరీమాబాద్‌లోని ఎస్ఆర్ఆర్ తోటలో సఖి సెంటర్ వరంగల్ ఆధ్వర్యంలో మంగళవారం సఖి సేవలపై మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం సెంటర్ నిర్వాహకురాలు తిరుమల మాట్లాడుతూ మహిళలు, బాలికల రక్షణ, భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి సెంటర్లను నడిపిస్తున్నాయని తెలిపారు. ఆత్యవసర సమయాల్లో టోల్ ఫ్రీ నంబర్లు 100, 181, 1098, 1457 నంబర్లపై అవగాహన పెంచుకోవాలని సూచించారు.

పంచాంగం ఆవిష్కరణ

వరంగల్ చౌరస్తా : వరంగల్ గోవిందరాజుల గుట్ట ఆవరణలో శ్రీమాన్ జగన్నాథం విష్ణువర్ధనాచార్యులు ఆధ్వర్యంలో రూపకల్పన చేసిన పంచాంగాన్ని వేయి స్తంభాల దేవాలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ మంగళవారం సాయంత్రం ఆవిష్కరించారు.

ప్రమాదకరంగా చలివాగు వంతెన



శిథిలావస్థకు చేరుకున్న వంతెనపై నిలిచిన వర్షపు నీరు (ఫైల్)



వంతెన ఇరుకుగా ఉండడంతో వంతెన వద్ద రాత్రి వేళ ట్రాఫిక్ జాం

- ఇరుకుగా ఉండడంతో ప్రమాదాలు
- శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రయాణికుల భయాందోళన
- పట్టించుకోని పాలకులు, అధికారులు

పరకాల : మండలంలోని చలివాగు వంతెన ప్రమాదకరంగా మారింది. ఇరుకుగా ఉండడంతో పాటు శిథిలావస్థకు చేరుకోవడంతో ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణిస్తున్నారు. అయితే గతంలో లోలెవల్‌గా ఉన్న పరకాల చలివాగు వంతెనపై నుంచి వర్షాకాలం వరద ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడేది. దీంతో పరకాల–భూపాలపల్లి జాతీయ రహదారిపై ఎంపీ నిధులతో మాజీ ఎమ్మెల్యే బొజ్జపల్లి రాజయ్య హయాంలో రూ.5కోట్ల నిధులు మంజూరు చేసి నిర్మించారు. అప్పటి నుంచి వరంగల్ నుంచి కాళేశ్వరం పుణ్యక్షేత్రం, పర్యాటక ప్రాంతం రామప్పతో పాటు భూపాలపల్లి, మహారాష్ట్ర, గోదావరిఖని, చెన్నూరు ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బందులు తొలగాయి. అయితే సింగరేణి బొగ్గును తరలించే లారీలతో పాటు వాహనాల రద్దీ పెరగడంతో చలివాగు వంతెన దెబ్బతిని శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పాటు ఇరుకుగా ఉండటంతో ముందు వెళ్లే వాహనాలను దాటే ప్రయత్నం చేసే క్రమంలో ఎదురుగా వచ్చే వాహనాలను ఢీ కొన్న సందర్భాలు ఉన్నాయి. అయినా పాలకులు, అధికారులు స్పందించకపోవడంతో విమర్శలు వస్తున్నాయి. మరోవైపు వంతెన రోడ్డంతా గుంతలమయం అవడం మరింత ప్రమాదకరంగా మారిందని వాహనదారులు ఆగ్రహిస్తున్నారు. భారీ వాహనాలు వంతెనపై వెళ్లే క్రమంలో కూడా ప్రమాదాలు జరిగి కిలో మీటర్ల పొడవు ట్రాఫిక్ నిలిచిపోతుందని, సంబంధిత అధికారులు, ప్రభుత్వం పట్టించుకుని నూతనంగా వంతెన నిర్మాణం చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ప్రయాణించాలంటే భయమేస్తోంది



చలివాగు వంతెన ఇరుకుగా ఉండడంతో ప్రయాణించాలంటే భయమేస్తోంది. రాత్రి వేళలో ప్రమాదాలు జరుగుతున్నాయి. పాలకులు తక్షణమే స్పందించి శిథిలావస్థకు చేరుకున్న వంతెనకు మరమ్మతు పనులు చేపట్టాలి.

-బొచ్చు కరుణాకర్, పరకాల

ఎన్‌సీసీతో విద్యార్థుల్లో క్రమశిక్షణ



విద్యార్థులకు ఎన్‌సీసీ ఎంపిక పరీక్షలు నిర్వహిస్తున్న అధికారులు

కమలాపూర్ : పాఠశాల స్థాయిలో ఎన్‌సీసీలో చేరడం ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, ఐకమత్యం అలవడుతుందని ఎన్‌సీసీ హవల్దార్ కుమార్ డీజీ, హవల్దార్ దీపక్ వాఘ్ అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ఎన్‌సీసీలో ప్రవేశాల ఎంపిక కోసం పదో బెటాలియన్ తెలంగాణ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ రామదురై ఆదేశాల మేరకు మంగళవారం పరీక్షలు నిర్వహించారు. ఎన్‌సీసీ ప్రవేశ పరీక్షలకు 120 మంది విద్యార్థులు హాజరు కాగా 25 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. అనంతరం బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.రవీందర్ మాట్లాడుతూ.. ఎన్‌సీసీలో చేరడం ద్వారా మానసిక, శారీరక దారుఢ్యం పెరగడంతో పాటు విద్య, ఉద్యోగ, పోలీసు నియామకాల్లో ఎన్‌సీసీ ధృవపత్రం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏటీపీ మంగ, డీడబ్ల్యూ సరితాభాయి, ఏఎన్ఓ విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు, ఎన్‌సీసీ విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులకు కొత్త రుణాలు మంజూరు చేయాలి

- టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు



సమీక్ష నిర్వహిస్తున్న మార్నేని రవీందర్‌రావు

వర్ధన్నపేట: రుణమాఫీ అయిన రైతులకు తిరిగి కొత్త రుణాలు ఇవ్వాలని, సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతుల రుణాలను లీగల్‌గా కవర్ చేసి వారికి మాఫీ లబ్ధి చేకూర్చాలని టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు అన్నారు. వర్ధన్నపేట డీసీసీబీ శాఖలో రాయపర్తి, నందనం, ఐనవోలు, వర్ధన్నపేట సొసైటీలు, ఐనవోలు, వర్ధన్నపేట డీసీసీబీల మేనేజర్లు, నోడల్ అధికారులు, సొసైటీ సిబ్బందితో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడుతూ బ్యాంకు లక్ష్యాలను నూటికి నూరు శాతం పూర్తిచేయాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డిపాజిట్లు, బంగారు ఆభరణాల రుణాలపై దృష్టిసారిస్తూ బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని కోరారు. వినియోగదారుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని అన్నారు. సమీక్ష సమావేశంలో నోడల్ అధికారి, ఏజీఎం గొట్టం ప్రవంతి, బ్రాంచ్ మేనేజర్లు సమత, శ్రావణ్, భద్రునాయక్, నందనం సొసైటీ ఛైర్మన్ చందర్‌రావు, వర్ధన్నపేట, రాయపర్తి సొసైటీ ఛైర్మన్లు రాజేశ్ఖన్నా, రామచంద్రారెడ్డి, సొసైటీ సీఈఓలు వెంకటయ్య, యాదగిరి, సంపత్, సోమయ్య, సిబ్బంది సురేశ్, సమ్మయ్య, ఉమేశ్ పాల్గొన్నారు.

బస్టాండ్ ఆవరణలో చలివేంద్రం ఏర్పాటు



బస్టాండ్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వెంకటేశ్వర్లు

పరకాల : ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు పట్టణంలోని బస్టాండ్‌లో కుంకుమేశ్వరస్వామి దేవస్థానం మాజీ ఛైర్మన్ గందె వెంకటేశ్వర్లు చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బస్టాండ్ చుట్టు కొందరు వ్యాపారస్తులు నీళ్ల వ్యాపారం చేస్తున్న దృష్ట్యా ప్రయాణికుల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆర్యవైశ్య మిత్రులతో కలిసి కూల్ వాటర్ మిషన్‌తో చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరకాల బస్ డిపో ఎస్టీ ఐ.కృష్ణకుమారి, బస్టాండ్ ఇన్‌చార్జ్ సురేందర్, డిపో కంట్రోలర్ రమేశ్, సీఆర్‌సీ తిరుపతి, విలేజ్ బస్ అధికారి సదానందం, వాటర్ వాటర్ ప్లాంట్ యాజమాని ఇమ్మడి లక్ష్మీనారాయణ, నాగబండి సంజయ్, బస్సు డ్రైవర్స్, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు రూ.26 వేల వేతనం ప్రకటించాలి



బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, ఔట్ సోర్సింగ్ కార్మికులు

- సీఐటీయూ నాయకుల డిమాండ్
- బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా

వరంగల్ అర్బన్ : మార్చి 19న ప్రవేశపెడుతున్న తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్లో మున్సిపల్ కార్మికులకు ప్రత్యేక పద్దు ద్వారా నెలకు ఒకరికి కనీస వేతనంగా రూ. 26 వేలు ప్రకటించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట సీఐటీయూ మునిసిపల్ యూనియన్ నాయకులు ధర్నా నిర్వహించారు. బరుపట్ల మహేష్, జన్ను ప్రకాశ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఉప్పలయ్య హాజరై మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్‌లో అమలు చేస్తున్నట్లుగా వేతనాలు రూ. 21 వేలు అమలు చేయడం లేదన్నారు. గత కౌన్సిల్లో వేతనాలు పెంచుతూ తీర్మానం చేసి ఆమోదించిన 452 మందికి రూ.16,600, డ్రైవర్లకి రూ.20,500 ఫిబ్రవరి నెల నుంచి పెంచి అందచేయాలని కోరారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులకు పనిముట్లు తదితర వసతులు కల్పించాలని విన్నవించారు. అనంతరం బల్దియా అడిషనల్ కమిషనర్ జోనాకు వినతిపత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో నాయకులు సింగారపు బాబు, యానబాబు, కృష్ణ, సందెల భిక్షపతి, జీవన్, సువర్ణ, శ్రీలత, రాధిక తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో చదవాలి

వరంగల్ : విద్యార్థులు పట్టుదలతో చదివి ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు మంచి గుర్తింపు తీసుకురావాలని లయన్స్ క్లబ్ అడిషనల్ క్యాబినెట్ సెక్రటరీ మామిడాల రమేశ్‌బాబు సూచించారు. మంగళవారం లేబర్ కాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉషోదయ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదోతరగతి విద్యార్థులకు పరీక్ష సామగ్రిని ఆయన అందజేశారు.

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో స్థానిక కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్ ఆధ్వర్యంలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా పెన్నులు పరీక్ష ప్యాడ్లు, పెన్సిళ్లు పంపిణీ చేశారు. అలాగే 41వ డివిజన్‌లో బీజేపీ మండల అధ్యక్షుడు బోరిగం నాగరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా ఎర్రబెల్లి ప్రదీప్‌రావు హాజరై పరీక్ష ప్యాడ్లు అందజేశారు.

ఒత్తిడి లేకుండా పరీక్షలు రాయాలి

హసన్‌పర్తి : ఎలాంటి ఒత్తిడి లేకుండా ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, విద్యారణ్యపురి కార్యదర్శి తేరాల యుగంధర్ సూచించారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, లయన్స్ క్లబ్ గోపాలపురం సహకారంతో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు మంగళవారం పరీక్షా ప్యాడ్‌లు పంపిణీ చేశారు. నగరంలోని దేవన్నపేట, కొత్తూరు పాఠశాలల్లో ఈ కార్యక్రమం జరిగింది.

డంపింగ్ యార్డు తరలించే వరకు ఉద్యమిద్దాం

మడికొండ : డంపింగ్ యార్డు తరలించే వరకు గ్రామస్తుందరం ఐక్యంగా ఉద్యమిద్దాం అని అడ్‌హక్ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. మంగళవారం మడికొండ అంబేడ్కర్ విగ్రహం వద్ద కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రేటర్‌వరంగల్‌లోని 66 డివిజన్ల నుంచి ప్రతీ రోజు సేకరించిన చెత్త సుమారు 400 టన్నులకు పైగా తడి, పొడి చెత్తా చెదారం తరలిస్తున్నారు. దీంతో చెత్త గుట్టలుగా తయారైంది.

ఈద్గాలో రంజాన్ ఏర్పాట్లు ప్రారంభం

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్‌రోడ్డు ఈద్గాలో రంజాన్ పర్వదిన ఏర్పాట్ల పనులు మంగళవారం ప్రారంభమయ్యాయి. మైదానంలో పిచ్చిమొక్కల తొలగింపు, పారిశుద్ధ్య కార్మికులు చీపుర్లతో ఊడ్చే పనులు వేగంగా జరుగుతున్నాయి. వక్ఫ్‌బోర్డ్ ఇన్‌స్పెక్టర్ ఎండీ.రియాజ్ హాజరై ఈద్గా అధ్యక్షుడు ఎంఏ జబ్బార్, ప్రధాన కార్యదర్శి చాంద్‌పాషాతో కలిసి పనులను పరిశీలించారు.

వినతిపత్రం అందజేత

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని పలు సమస్యలను పరిష్కరించాలని ఏబీవీపీ ఆధ్వర్యంలో మంగళవారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రంకు వినతిపత్రం సమర్పించారు. కళాశాలకు అకడమిక్ బ్లాక్‌ను నిర్మించాలని ఏబీవీపీ కేయూ అధ్యక్షుడు సాయికుమార్ ఇతర బాధ్యులు విన్నవించారు.

నియామకం

కేయూ క్యాంపస్ : హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కాలేజీ దూరవిద్య కేంద్రం కోఆర్డినేటర్‌గా మ్యాథ్స్ విభాగం అధ్యాపకురాలు డాక్టర్ మంజులను నియమిస్తూ ప్రిన్సిపాల్ జ్యోతి ఉత్తర్వులు జారీచేశారు.

లౌకిక వ్యవస్థ మనుగడకు ప్రమాదకరం

కేయూ క్యాంపస్: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విద్యారంగంలో, విశ్వవిద్యాలయాల్లో తీసుకొచ్చే సంస్కరణలు సమైక్య స్ఫూర్తికి, లౌకిక వ్యవస్థ మనుగడకు ప్రమాదకరమని కాకతీయ యూనివర్సిటీ ఎకనామిక్స్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ వినాయకరెడ్డి అన్నారు. మంగళవారం యూనివర్సిటీలో పీడీఎస్‌యూ తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో లైబ్రరీ నుంచి కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంటు కళాశాల వరకు విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కామర్స్ విభాగం సెమినార్‌హాల్‌లో నిర్వహించిన యూనివర్సిటీల రాష్ట్రస్థాయి విద్యార్థుల సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను కాలరాసే విధంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. కేయూ స్పోర్ట్స్‌బోర్డు సెక్రటరీ ఆచార్య వెంకయ్య మాట్లాడుతూ యూజీసీ నూతన విధానాలతో ముసాయిదాను రూపొందించిన కేంద్రం ఆ ము సాయిదాతో యూనివర్సిటీల స్వయంప్రతిపత్తి దెబ్బతీస్తుందన్నారు. కేంద్రప్రభుత్వం చర్యలతో విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తి మనుగడ ప్రశ్నార్థకంగా మారనుందన్నారు.

లక్ష్మీనృసింహుడికి స్వాతినక్షత్ర పూజలు



సుదర్శన నారసింహ హవన పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



మంగళ సూత్రాలను చూపుతున్న అర్చకులు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లి గ్రామంలో నారసింహుడికి, గర్భాలయంలోని లక్ష్మీనృసింహుడికి స్వాతినక్షత్రాన్ని పురస్కరించుకుని మంగళవారం అభిషేకం, సుదర్శన నారసింహ హవనం, కల్యాణం జరిపించారు. నిత్యపూజల అనంతరం లక్ష్మీనరసింహ స్వామి స్తంభమూర్తి, గర్భాలయంలోని ధ్రువ మూర్తులు, ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అర్చకులు పంచసూక్తం పఠిస్తు విశేషంగా అభిషేకం జరిపించారు. అనంతరం అర్చకులు సుదర్శన నారసింహ హోమం వేదోక్తంగా నిర్వహించారు. లక్ష్మి–నరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి–వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు కల్యాణం పాంచరాత్ర ఆగమానుసారం జరిపించారు. అర్చన, నీరాజన మంత్రపుష్పంతో పాటు నక్షత్రహారతి సమర్పించారు. ఆచార్యులు వెంకటరత్నం, జయకృష్ణ, విక్రమ్, నల్లబెల్లి భజన బృందం, భక్తులతో పాటు తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ప్రభాకర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



ఐనవోలు : సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు

ఎల్కతుర్తి : బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ బిల్లును శాసనసభలో ఆమోదం తెలిపినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ మంగళవారం కాంగ్రెస్ నాయకులు మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపం వద్ద, భీమదేవరపల్లి మండలం ముల్కనూరు అంబేడ్కర్ చౌక్ వద్ద ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ప్రభుత్వ నిర్ణయానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, నాయకులు సుకినె సంతాజీ, గోలి రాజేశ్వర్‌రావు, బొమ్మనపల్లి అశోక్‌రెడ్డి, అనిల్, రాజయ్యగౌడ్, సుమన్, శ్రీనివాస్, మహేందర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అనిల్‌యాదవ్ పాల్గొన్నారు.

ఐనవోలు : మండల కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి టెస్కాబ్ ఛైర్మన్ మార్నేని రవీందర్‌రావు పాలాభిషేకం చేశారు. రాజీవ్ యువవికాసం పథకం ద్వారా 6 వేల కోట్లు నిరుద్యోగ యువతకు కేటాయించిన సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నాయకులు బుచ్చిరెడ్డి, సాంబయ్య, సుధీర్, రాకేష్‌రెడ్డి, సునీల్, భాస్కర్, రాజు, రవి, సమ్మయ్య, సతీశ్, కుమారస్వామి, రహీం పాషా, సాంబయ్య, శ్రీనివాస్, మహేందర్, మొగిలి, ప్రశాంత్, జనార్దన్, ఉత్తమ్ కుమార్, జగన్, అరవింద్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

ముల్కనూరులో 30పడకల ఆస్పత్రి నిర్మించాలి

- బీజేపీ నాయకుల ధర్నా, రాస్తారోకో



హనుమకొండ-సిద్దిపేట రహదారిపై ధర్నా, రాస్తారోకో చేస్తున్న బీజేపీ నాయకులు

ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని నిర్మించాలని కోరుతూ మంగళవారం బీజేపీ నాయకులు ముల్కనూరు అంబేడ్కర్ చౌక్ వద్ద హనుమకొండ-సిద్దిపేట రహదారిపై ధర్నా, రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా నాయకుడు పైడిపెల్లి పృథ్వీరాజ్ మాట్లాడుతూ.. ఎల్కతుర్తి, భీమదేవరపల్లి, అక్కన్నపేట మండలాలకు రవాణా సౌకర్యం ఉందని, ముల్కనూరులో 30 పడుకల ప్రభుత్వ ఆస్పత్రిని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు అనేక హామీలిచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు మెరుగైన వైద్యం అందించడంలో విఫలం అయ్యిందన్నారు. కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ఎల్కతుర్తి నుంచి మెదక్ వరకు 850 కోట్లతో ఫోర్‌లైన్ రోడ్డుకు నిధులు తీసుకొస్తే, మంత్రి పొన్నం ప్రభాకర్ పనుల పరిశీలనకు వచ్చారని విమర్శించారు. గత పాలకులు 30 పడుకల ఆస్పత్రిని నిర్మించకుండా కాలయాపన చేసి చేతులు దులుపుకొన్నారని అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం 30 పడకల ఆస్పత్రిని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొమురయ్య, సారయ్య, మల్లారెడ్డి, సదానందం, రాజు, రమేశ్, భిక్షపతి, ప్రదీప్‌రెడ్డి, శ్రీకాంత్, సాయి, నవీన్, భాస్కర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఇంటర్ దశ కీలకం

- పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు



వీడ్కోలు సమావేశంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

వేలేరు : విద్యార్థులకు ఇంటర్మీడియేట్ దశ కీలకమని మండలంలోని పీచర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం శ్రీదేవి అన్నారు. మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులకు పలు సూచనలు చేశారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని అన్నారు. ఇంటర్‌లో చేరబోయే విద్యార్థులు కళాశాలలో జాగ్రత్తగా ఉండాలన్నారు. చెడు స్నేహాలకు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి సారించి ఉన్న స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇంటర్ దశ విద్యార్థులను చెడు వైపునకు తోసే ప్రయత్నం చేస్తుందని, కానీ విద్యార్థులు అప్రమత్తంగా ఉంటూ మంచి వైపే పయనిస్తే జీవతంలో ఉన్నతంగా ఎదుగుతారని అన్నారు. విద్యార్థులు తమ పాఠశాల అనుభవాలను తోటి విద్యార్థులతో పంచుకున్నారు. అనంతరం ఉపాధ్యాయులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వేణు, శ్రీధర్, భాస్కర్, రవిచందర్, దయాకర్, మాధవి, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

- 9వ రోజుకు చేరిన దీక్షలు



రిలే దీక్షలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆత్మకూరు : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం 9వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రఘు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించక ముందే సీఎం రేవంత్‌రెడ్డి ఉద్యోగ నియామకాలు చేపట్టడం సరికాదన్నారు. వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిన అనంతరం ఉద్యోగాలు ఇవ్వాలన్నారు. ఎస్సీ వర్గీకణకు చట్టబద్ధత కల్పించే వరకు పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు అర్షం స్వామి, ఎమ్మార్పీఎస్ మాజీ మండల అధ్యక్షుడు నాగెల్లి రాజు, నాయకులు రాజేశ్, శ్రీకాంత్, రజనీకాంత్, తరుణ్, నాగరాజుతో పాటు తదితరులు పాల్గొన్నారు.